

గాంధీరోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది




ఫుట్‌పాత్ ఆక్రమణలపై
కార్పొరేషన్ కొరడా

- టీడీపీ నేతల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

తిరుపతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై తిరుపతి నగరపాలక సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు పురిగొల్పి చిరువ్యాపారులనుంచి నెలవారీ మామూళ్లను అధికార పార్టీ నేతలు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై దృష్టిసారించింది. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు పార్టీ శ్రేణులతో కలసి ఐదు రోజుల క్రితం కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌తో పాటు టీటీడీ ఈవోకు, ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.దీంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. స్మార్ట్ సిటీ నిధులతో పాదచారులకోసం అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లు చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి.బాటసారులకు నడిచేదారిలేక అవస్థలు పడుతున్నారు.చాలాచోట్ల ఫుట్‌పాత్‌లపై శాశ్వత నిర్మాణాలు చేపట్టి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రహదారిపైకి వచ్చే వాహనాలు వేగంగా వెళ్లడంతో బాటసారులు నడిచే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం రైల్వేస్టేషన్ రోడ్డులో మొదలైన ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు గురువారం గాంధీరోడ్డుకు చేరుకుంది. విష్ణునివాసం, గోవిందరాజ స్వామి ఆలయం, గాంధీరోడ్డు వరకు కార్పొరేషన్ అధికారులు పోలీసు బలగాలతో కలసి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఇప్పటివరకు 60కిపైగా ఆక్రమణలు తొలగించినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం చెప్పారు. కొన్ని చోట్ల వైసీపీ, వామపక్ష నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు ముందుకు పోతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతుల కారణంగానే వైసీపీ నేతలు దందాలు చేసి తోపుడు బండ్ల దగ్గర వసూలు చేశారంటున్న వామపక్ష నాయకులు తొలగింపును తాము స్వాగతిస్తామంటున్నారు. అయితే ఎన్డీఏ కూటమి నేతలు కూడా ఫుట్‌పాత్‌లపై బండ్లుపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదంటున్నారు. ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియ అని శుక్రవారం బైరాగిపట్టెడ, ఆ తర్వాత తిరుమల బైపాస్ రోడ్డువైపు వెళ్లనున్నట్టు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే తోపుడు బళ్ల వ్యాపారం కోసం ప్రత్యామ్నాయంగా ప్రత్యేక హాకర్ జోన్స్ నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, ఆ దిశగా కూడా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాల్సి వుందని పలువురు సూచిస్తున్నారు.

1న పింఛన్ల
పంపిణీకి ఏర్పాట్లు



- జిల్లాలో 2,69,162మందికి లబ్ధి
- రూ.182.33కోట్లు మంజూరు
- సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27 : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్లను జూలై 1న పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.రూ.3వేలున్న పింఛను రూ.4వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచే పెంచిన మొత్తాన్ని అందజేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛను పెంపు ఫైల్‌పై ఆయన సంతకం చేశారు.ఈ నేపథ్యంలో పింఛనుదారులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా వారికి ఇంటి వద్దే పింఛను అందేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్లను పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది.జిల్లావ్యాప్తంగా 691 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5,827 సిబ్బంది ఉన్నారు. ఆ పరిధిలోని లబ్ధిదారులకు ఎలాంటి సమస్య లేకుండా ఒకటి రెండు రోజుల్లో పింఛన్ల ప్రక్రియ పూర్తిచేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు. ఒక్కో ఉద్యోగికి 50 ఇళ్ల చొప్పున మ్యాపింగ్ చేశామన్నారు..జూలై 1న ఏప్రిల్, మే, జూన్‌లకు కలిపి రూ.7వేలు పంపిణీ చేయనున్నారు.ఈ నెల 30వ తేదీ ఆదివారం కావడంతో 29వ తేదీకే అన్ని సచివాలయాలకు పెన్షన్ల సొమ్ము అందజేయనున్నారు.జిల్లాలోని 2,69,162మంది లబ్ధిదారులకు ప్రతి నెలా సుమారు రూ.81కోట్లు పంపిణీ చేసేవారు.పెన్షన్ల పెంపుతో ఈ నెల రూ.182.33 కోట్లు పంపిణీ చేయనున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చాలి

తిరుపతిరూరల్,జూన్27: చిరుధాన్యాలను ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగం చేయడం ద్వారా సాగు విస్తీర్ణం పెంచవచ్చని భారత వ్యవసాయ పరిశోధనామండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ పేర్కొన్నారు. తిరుపతిలోని వెటర్నరీవర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనా సదస్సును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.దేశవ్యాప్తంగా చిరుధాన్య పంటలసాగు తక్కువగా ఉన్నప్పటికీ ఉత్పాదకత అధికంగానే ఉందని తెలిపారు.5 వేల సంవత్సరాలుగా సాగులో ఉన్నపంటగా సజ్జకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ ఏపీలో ప్రతి జిల్లాలో ఒక్కొక్కరకం చిరుధాన్యపంట సాంప్రదాయపంటగా సాగులో ఉందని, ఐసీఏఆర్ సహకారంతో వర్సిటీపరిధిలోని నాలుగు పరిశోధనాస్థానాల్లో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తూ అనువైన చిరుధాన్య రకాలను, సాగుకు అవసరమైన సాంకేతికతను అందిస్తున్నామని తెలిపారు.పోషకాహార భద్రతలో చిరుధాన్య పంటల పాత్ర ఎక్కువగా ఉందని, కొవిడ్-19 తర్వాత చిరుధాన్య ఆహారంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు.ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌కే ప్రధాన్ మాట్లాడుతూ ఉత్పాదకత పెంచితే చిరుధాన్యాల సాగు లాభదాయకమవుతుందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ,ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్,ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీవ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, 220మంది పరిశోధకులు, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న తిలక్‌రాజ్ శర్మ



మూడు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న చిత్తూరు జడ్పీ మాజీ సీఈవో (ఎఫ్ఏసీ) ప్రభాకర్‌రెడ్డిపై వేటు పడింది. వైసీపీ ప్రభుత్వంలో.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆయన ఎట్టకేలకు సస్పెండయ్యారు. ఈ మేరకు గురువారం పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

- చిత్తూరు రూరల్

- ఎట్టకేలకు జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్
- విచారణ పూర్తయ్యేవరకు హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లకూడదని ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన పీఆర్ కమిషనర్

పదవీ విరమణలోపే వేటు

బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా రెగ్యులర్ పోస్టులో ఉన్న ప్రభాకర్‌రెడ్డి.. ఉమ్మడి జిల్లాలోనే అత్యంత జూనియర్ అధికారి. ఏ మాత్రం అర్హత లేకున్నా చిత్తూరు జిల్లా పరిషత్తు సీఈవో పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలతో సుదీర్ఘంగా కొనసాగారు. అంతే కాకుండా, సీఈవోతో పాటు డిప్యూటీ సీఈవో, ఏవోగా మూడు పోస్టుల్లోనూ ఏకకాలంలో కొనసాగారు. వాస్తవానికి ఈయనకు ఏవో పోస్టుకు మాత్రమే అర్హత ఉంది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో మూడు పోస్టుల్లోనూ కొనసాగారు. ఎన్నికల కోడ్ వచ్చాక మాత్రమే ఆయన్ను ఆ పోస్టులో నుంచి తప్పించగలిగారు. అప్పుడు కూడా ఎంపీడీవోగా కాకుండా మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా జిల్లా పోస్టులో కూర్చొబెట్టారు. ఈయన గురించి మొత్తం తెలిసినా, పెద్దిరెడ్డి వెనుక ఉన్నారనే కారణంగా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేకపోయారు.



ప్రభాకర్‌రెడ్డి

విచారణకూ ఆదేశం

ఈనెలాఖరులో పదవీ విరమణ చేయాల్సిన జడ్పీ మాజీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం సస్పెండు చేయడంతో పాటు విచారణకూ ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదనీ పేర్కొంది. సీఈవోగా పనిచేసిన కాలంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకులు, జడ్పీలోని ప్రస్తుత, విశ్రాంత అధికారులు సాక్ష్యాలతో సహా సంబంధిత అధికారులకు అనేకమార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈయన్ను కాపాడుకుంటూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగకుండా చూసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సస్పెండయ్యారు.

సుదీర్ఘంగా శాసించిన వైనం

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా జడ్పీలో హవా మాత్రం ప్రభాకర్‌రెడ్డిదే. దీంతో ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. జడ్పీలో ఆయన అనుభవించని పదవంటూ లేదనే చెప్పాలి. 2008 నుంచి 2017 వరకు పదేళ్ల పాటు జడ్పీలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2017లో ఎంపీడీవోగా పదోన్నతితో బైరెడ్డిపల్లెకి బదిలీ అయ్యారు. అయినా, డిప్యుటేషన్‌పై మళ్లీ జడ్పీకి వచ్చి ఓఎస్డీగా కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను ఆపేవారే లేకుండా పోయారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో ఏక కాలంలో జడ్పీ ఏవోగా, డిప్యూటీ సీఈవోగా, జడ్పీ సీఈవోగా పనిచేసిన ఘనత ఆయనది. ఆ సమయంలో జడ్పీని ఆయన కనుసన్నల్లో శాసించారు.

ఉద్యోగులపై వేధింపులు

జూనియర్ మోస్ట్ ఎంపీడీవో జడ్పీ సీఈవో ఏంటని ప్రశ్నించిన ఒక్కో అధికారిని వేధించడం మొదలుపెట్టారు. కిందిస్థాయి రికార్డు అసిస్టెంట్ నుంచి ఎంపీడీవో వరకు ఎవరినీ వదిలి పెట్టలేదు. ఆయన మాటకు ఎదురు చెప్పిన వారందరినీ ఒక ఆట ఆడుకున్నారు. రాత్రిళ్లు 11 గంటల వరకు కార్యాలయంలో ఉంచి పని చేయించేవారు. ప్రభాకర్‌రెడ్డి వేధింపుల కారణంగా జిల్లాలోని నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ప్రాణాలు కోల్పోయారని సాక్షాత్తు జడ్పీ ఉద్యోగులే పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతలే టార్గెట్‌గా బిల్లుల పెండింగ్

టీడీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల్ని ఈయన మంజూరు చేయకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీని కారణంగా అప్పులకు వడ్డీలు పెరగడంతో కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక టీడీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లను ఆయన టార్గెట్ చేశారు. గడిచిన ఐదేళ్లలో వీరికి ఒక్క బిల్లు కూడా మంజూరు చేయలేదు. అప్పులకు వడ్డీలు కట్టలేక అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. కోర్టు ఆర్డర్లను కూడా లెక్క చేయకుండా బిల్లుల్ని నిలిపేశారు. కోర్టు కేసులు కోసం రూ.లక్షలు వెచ్చించాల్సి వచ్చిందని కాంట్రాక్టర్లు, సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

భారీగా జడ్పీ నిధుల దుర్వినియోగం

ప్రభాకర్‌రెడ్డి హయాంలోనే జడ్పీలో భారీఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాల సహ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. 2005 నుంచి 2014 వరకు బీఆర్‌జీఎఫ్ నిధులు, 2005 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘం నిధులు ఏటా జడ్పీకి మంజూరయ్యాయి. ప్రభుత్వ ఖాతాలకు జమయ్యే ఈ నిధుల్ని ప్రభాకర్‌రెడ్డి సేవింగ్స్ ఖాతాలకు మళ్లించేవారని, వడ్డీ డబ్బులే రూ.వంద కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆ వడ్డీ డబ్బుల్ని ప్రభుత్వానికి లెక్కలు చూపించకుండా సొంతానికి, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అవసరాలకు వాడినట్లు ఆరోపణలున్నాయి.

సుదీర్ఘ పోరాటం : జడ్పీలో పనిచేసిన విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు, చిత్తూరు రూరల్ మండలానికి చెందిన టీడీపీ నేత కాండ్ర రమేష్‌నాయుడు జడ్పీలోని అక్రమాల గురించి కొన్నేళ్లుగా పోరాడుతూ.. సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వీరికి తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేత చంద్రప్రకాష్, సురేంద్రకుమార్ తదితరులు ఇటీవల కుప్పంలో సీఎం చంద్రబాబుకు, ఆయన సెక్రటరీ ప్రద్యుమ్నకు ప్రభాకర్‌రెడ్డి మీద ఫిర్యాదు చేశారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కూడా ఆరణి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. కనకరాజులు నాయుడు మాత్రం ప్రభాకర్‌రెడ్డి అవినీతి గురించి సాక్ష్యాలు సంపాదించడంలో ముఖ్య భూమిక పోషించారు.

విచారణకూ ఆదేశం

ఈనెలాఖరులో పదవీ విరమణ చేయాల్సిన జడ్పీ మాజీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం సస్పెండు చేయడంతో పాటు విచారణకూ ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదనీ పేర్కొంది. సీఈవోగా పనిచేసిన కాలంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకులు, జడ్పీలోని ప్రస్తుత, విశ్రాంత అధికారులు సాక్ష్యాలతో సహా సంబంధిత అధికారులకు అనేకమార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈయన్ను కాపాడుకుంటూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగకుండా చూసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సస్పెండయ్యారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు తమిళనాట
నో ఎంట్రీ

- తడనుంచి పికప్ వ్యాన్లలో చెన్నైకి ప్రయాణికుల తరలింపు
- ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లను ఒప్పుకోని తమిళనాడు అధికారులు
- కేసుల భయంతో తడ నుంచే రాకపోకలు సాగిస్తున్న బస్సులు
- పర్మిట్లు లేకుండా దర్జాగా తడకు వచ్చి వెళ్తున్న పికప్ వ్యాన్లు



తడ కరిపేటి కాలువ సమీపంలో నిలిచి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

తడ, జూన్ 27 : ప్రైవేట్ బస్సులకు ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లపై తమిళనాడు ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. దీంతో ఆ బస్సుల్లో ప్రయాణికులు తడ నుంచి చెన్నైకి పికప్ వ్యాన్లలో రాకపోకలు సాగించాల్సివస్తోంది. చెన్నై నుంచి తడ మీదుగా హైదరాబాదు, వైజాగ్, విజయవాడ ప్రాంతాలకు సుమారు 75కు పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.ఆలిండియా పర్మిట్ ద్వారా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల పేరుతో ఇవి ఎక్కడైనా ప్రయాణించే అవకాశం ఉంది. అయితే తమిళనాడు, ఏపీ, తెలంగాణా పరిధిలో ప్రయాణించే చాలా బస్సులు ఆయా రాష్ట్రాల్లో పర్మిట్లు పొందకుండా ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాకపోకలు సాగిస్తున్నాయి.ఈశాన్య రాష్ట్రాలలో పర్మిట్ పన్నుల వసూళ్ల తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. వాస్తవంగా ఏపీలో ఒక బస్సు సీట్‌కు 3 నెలల కాల వ్యవధికి సుమారుగా 3,500 రూపాయల వరకు పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండగా,తమిళనాడులో సుమారుగా 3,200 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం ఒక సీట్‌కు కేవలం 400 రూపాయల లోపే పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండటంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు అక్కడ పర్మిట్లు పొందుతున్నారు. పైగా ఆ రాష్ట్రాల్లో బస్సుల తనిఖీ ఉండదు. బస్సులు ఎక్కడో ఉన్నా మధ్యవర్తుల సహాయంతో కొంతసులభంగా ఆయా రాష్ట్రాల పర్మిట్లు దొరుకుతాయి. దీంతో మనరాష్ట్రంలో 40సీట్లుగల ఒక బస్సుకు 3 నెలల కాలానికి సుమారు 1.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా, అదే బస్సుకు ఈశాన్య రాష్ట్రంలో కేవలం 16వేల రూపాయలకే పర్మిట్ అందుబాటులోకి వస్తుంది. ఇలాంటి బస్సులపై తమిళనాడు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. చెన్నై నుంచి ఏపీ, తెలంగాణాలకు వెళ్లినట్లుగానే తమిళనాడులోని వివిధ ప్రాంతాలతోపాటు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వందల సంఖ్యలో ప్రైవేట్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.ఇటీవల ఒడిశా, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పర్మిట్ పొందిన బస్సులపై తమిళనాడు ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. తమిళనాడు పర్మిట్లు సైతం పొందాలంటూ మెలిక పెడుతోంది. దీంతో ఆయా బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. చెన్నై నుంచి తడ మీదుగా రాకపోకలు సాగించే ఈ ప్రైవేట్ బస్సులను తడ వద్దే నిలిపివేసి పికప్ వ్యాన్ల ద్వారా ప్రయాణికులను అటుఇటు తరలిస్తున్నాయి.

పర్మిట్ లేకున్నా దర్జాగా రాకపోకలు

ఏపీలో రవాణాశాఖ చెక్‌పోస్టులను గత మార్చి నెలలో ప్రభుత్వం మూసివేసింది. తద్వారా వాహనాలు తనిఖీ చేసే అధికారులు లేకపోవడంతో కొందరు వాహనదారులు పర్మిట్లు లేకుండానే మనరాష్ట్రంలోకి వచ్చి వెళ్లిపోతున్నారు.ముఖ్యంగా శ్రీసిటీ, నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ వరకు వందల సంఖ్యలో వాహనాలు పర్మిట్లు లేకుండానే రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సైతం ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. ఏపీలోకి పర్మిట్లు లేని పికప్ వ్యాన్లలో ప్రయాణికులను తడ-చెన్నైల మధ్య తరలిస్తున్నాయి. ఓ పక్క ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా తాజాగా పర్మిట్లు లేని ఈ పికప్ వ్యాన్లు సైతం వచ్చి వెళ్తూ మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయి. పైగా ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి పూర్తిస్థాయిలో బస్సు చార్జీలను వసూలు చేస్తూ చెన్నై- తడ మధ్య పికప్ వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇకనైనా రవాణాశాఖ అధికారులు పర్మిట్‌లేని పికప్ వ్యాన్లపై చర్యలు తీసుకోవడమేకాకుండా తమిళనాడు తరహాలో ఈ బస్సుల నుంచి పర్మిట్ల రూపేణా పన్నులు వసూలు చేయాల్సివుంది.

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ఆయన ఆరునెలల పాటు లేదా కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించేంత వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు సహకార సంఘాలకు గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన నాన్-అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సెవెన్‌మెన్ కమిటీలు ఈనెల 8వ తేదీన, చైర్‌పర్సన్లు ఎస్.రెడ్డెమ్మ, ఎస్.నాగలక్ష్మిలతో సహా సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో పాలకవర్గాలు రద్దయ్యాయి. అప్పట్నుంచి రెండు సంఘాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. ఇక అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి నియామకంతో కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.

అమ్మవారి ఆలయ అధికారుల నిజాయితీ


పోగొట్టుకున్న నగదును భక్తులను అందజేస్తున్న ఆలయ అధికారులు

తిరుచానూరు, జూన్ 27: కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు చెందిన జమున అనే భక్తురాలు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి ఆలయానికి గురువారం మధ్యాహ్నం విచ్చేశారు. దర్శనానంతరం ప్రసాదాలు స్వీకరించే కౌంటర్‌లో ఆమె పర్సును పోగొట్టుకుంది. గుర్తించిన ఆలయ అధికారులు పర్సును స్వాధీనం చేసుకుని అందులోని గుర్తింపు కార్డుల ఆధారంగా ఆలయంలోని మైక్‌సెట్‌ద్వారా అనౌన్స్‌మెంట్ చేయగా, భక్తురాలు జమున ఆలయం వద్దకు చేరుకున్నారు. పర్సులో ఉన్న రూ.28వేల నగదుతో క్రెడిట్, డెబిట్‌కార్డులను సూపరింటెండెంట్ మధు, విజిలెన్స్ ఏఎస్ఐ బ్రహ్మానందరాజు, ఆలయ సిబ్బంది అందజేశారు. ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నారా లోకేశ్‌కు మమత అభినందన



తిరుపతిరూరల్, జూన్ 27: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌ను అమరావతిలో తిరుపతి ఎంఆర్‌పల్లె మాజీ సర్పంచ్ బోయన పాటి మమత గురువారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్‌కు తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందించి అభినందించారు.

మంత్రి నారా లోకేశ్‌ను అభినందిస్తున్న మాజీ సర్పంచ్ మమత

కాలినడకన తిరుమలకు నటి హేమ



తిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సినీనటి హేమ గురువారం కాలినడకన తిరుమలకు వచ్చారు. బెంగళూరు రేవ్ పార్టీ వ్యవహారంలో అరెస్ట్ అయిన హేమ ఇటీవల బెయిల్‌పై వచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆమె శ్రీవారి దర్శనార్థం అలిపిరి కాలినడక మార్గంలో గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి సేవలో కళా వెంకట్రావు



తిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ ఎమ్మెల్యేలు ధర్మరాజు, దూళిపాళ్ల నరేంద్ర, కళా వెంకట్రావు, కర్ణాటక ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిణి సింధూరి ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నానీ విజయంతో తిరుత్తణికి పాదయాత్ర


తిరుత్తణికి పాదయాత్రగా టీడీపీ నాయకులు

తిరుచానూరు, జూన్ 27: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించడంతో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో తిరుపతి రూరల్ మండల తెలుగు యువత అధ్యక్షుడు రావిళ్ల సురేంద్ర నాయుడు గురువారం తిరుచానూరు నుంచి తిరుత్తణికి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల తరువాత చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానీని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్నానన్నారు. టీడీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, హరేరామ్‌రెడ్డి, అమిలినేని మధు, మన్మధకుమార్‌రెడ్డి, త్రివిక్రమ్, వెంకటేష్, జీవన్, శివకుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సతీమణి

తిరుచానూరు, జూన్ 27: తిరుపతి రూరల్ మండలం కుప్రపాకం పంచాయతీ గంగమ్మ జాతరను ప్రజలు వేడుకగా నిర్వహించారు. జాతర సందర్భంగా గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పట్టువస్త్రాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతు అభివృద్ధికి ప్రాధాన్యత: ఎమ్మెల్యే నాని



రామచంద్రాపురం, జూన్ 27: టీడీపీ రైతు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం వేరుశనగ పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతు సంక్షేమం ఎన్నో పథకాలను అమలు చేశారన్నారు. చెరకు పంట గిట్టుబాటు కావడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాయితీ విత్తనాలు ఎన్ని కావాలన్నా తెప్పించి పంపిణీ చేస్తామన్నారు. వేదాంతపురం నుంచి రాయలచెరువు పేట వరకు డబుల్‌రోడ్డు పనులను ప్రారంభిస్తామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్ధన్ చౌదరి, హరిప్రసాద్, నరసింహారెడ్డి, జేడీ జగన్, ఢిల్లీనాథరెడ్డి, బాబుయాదవ్, ధనంజయరెడ్డి, మండల నాయకులు గిరి నాయుడు, మునెయ్య, సుబ్రహ్మణ్యంయాదవ్, సురేంద్ర నాయుడు, జీవరత్నం, మునిరామిరెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, ఎంపీడీవో ప్రత్యూష, ఏవో స్రవంతి పాల్గొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చూడండి

చంద్రగిరి, జూన్ 27: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎంపీడీవో వెంకట సూర్యసాయి అన్నారు. గురువారం మండలంలోని కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కొటాల పీహెచ్‌సీ వైద్యురాలు బొల్లినేని కుసుమ, ఎంపీహెచ్‌ఈవో ఈశ్వరయ్య, సిబ్బంది లలిత, వాసుదేవ, వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ అనిత, నాగరాణి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీవోలు, తదితరులు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్‌గా మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి!



చంద్రగిరి, జూన్ 27: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్‌గా టీడీపీ నాయకుడు మొక్కల చంద్రశేఖరరెడ్డి నియమితులు కానున్నారు. గురువారం తొండవాడలో టీడీపీ సీనియర్ నాయకులు గిరిధర్‌రెడ్డి ఇంట్లో ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు సమావేశమయ్యారు. మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణంలో మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి ముందుంటున్నారని, గత టీడీపీ ప్రభుత్వంలో చైర్మన్‌గా పని చేసినందున ఆయన పేరును నాని ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్‌గా ప్రకటించినందుకు మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే పులివర్తి నానీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, సీనియర్ నాయకులు కుమారరాజా రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సురేష్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా తదితరులు ఉన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



చంద్రగిరి, జూన్ 27: చంద్రగిరిలోని కొత్తపేట నూకలగుంట వద్ద రైతు భరోసా కేంద్రంలో గురువారం రాయితీతో వేరుశనగ విత్తనకాయల పంపిణీని ఎమ్మెల్యే నానీ ప్రారంభించారు. రైతులందరూ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట సూర్యసాయి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబదర రావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సురేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు కుమారరాజారెడ్డి, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, వ్యవసాయాధికారి విజయభాస్కర్, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అతిసార బాధిత గ్రామాల్లో అప్రమత్తం

● కాట్రపల్లిని సందర్శించిన అధికారులు


వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో, ఆర్డీవో, డీపీవో, డీఎల్‌పీవో

కేవీబీపురం, జూన్ 27: అతిసార వ్యాధి ప్రభావం చూపిన కాట్రపల్లిలో గురువారం డీఎంహెచ్‌వో శ్రీహరి, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎల్‌పీవో ప్రభురెడ్డి, డీపీవో రూపేష్, ఎంపీడీవో రెడ్డెయ్య పర్యటించారు. ఈ వ్యాధి లక్షణాలతో దర్శిని అనే చిన్నారి బుధవారం మరణించిన విషయం తెలిసిందే. తొలుత అధికారులు పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. శానిటేషన్ చేయించారు. తాగునీటి పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి మినరల్ వాటర్‌ను అందజేస్తున్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పారిశుధ్యం సరిగా లేక, కలుషిత ఆహారం తీసుకోవడం వలన అతిసారం ప్రబలిందని వివరించారు. ఆర్డీవో మాట్లాడుతూ అతిసార రాకుండానే గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలను తీసుకోరాదని సూచించారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మఠం, భైరాజులకండ్రిగ, అంజూరు పాళెం, బంగారమ్మకండ్రిగ గ్రామాల్లో కూడా ఒకరిద్దరికి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. వైద్యసిబ్బంది ప్రత్యేకంగా ఆ గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేదార్, డీటీ వెంకటసుబ్బయ్య, వైద్యాధికారి కుమార్, ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి గోవిందస్వామి, ఎంసీవో అంకయ్య, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి


కూచువారిపల్లెలో విద్యార్థుల ర్యాలీ

చంద్రగిరి, జూన్ 27: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, చదువుకునే వయసులో ఎవరూ పనికి వెళ్లరాదని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలచే ర్యాలీలు నిర్వహించారు. గురువారం మండలంలోని చిన్నరామాపురం, కూచివారిపల్లె, బూడిదగట్టుపల్లి, మూలపల్లి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు లలిత కుమారి, భాస్కర్ బాబు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదనమోహన్, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, పీరయ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శైలశ్రీ, రాజేంద్రబాబు, ధనంజయ, శ్రీరాములు, చెంచయ్య, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ భరద్వాజ, సీఆర్పీలు రమేష్, టీడీపీ నాయకులు మునిచంద్ర, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెలికం వినియోగదారులకు మెరుగైన సేవలు

రామచంద్రాపురం, జూన్ 27: టెలికం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ట్రాయ్ పనిచేస్తుందని ఆ సంస్థ సభ్యుడు చిట్టిబాబు అన్నారు. మండలంలోని రామాపురం కమ్యూనిటీ భవనం వద్ద గురువారం టెలికం కంపెనీ వినియోగదారుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ 2025 నాటికి దేశవ్యాప్తంగా 6లక్షల గ్రామాల్లో ఇంటర్నెట్ ఉండే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ సదస్సులో బీఎస్ఎన్ఎల్ డీఈ ప్రభాకర్, తిరుపతి జిల్లా లీగల్ సర్వీస్ మెంబరు అమర్‌నాథ్ పాల్గొన్నారు.

వైసీపీ యువ నేతపై దాడి


గాయపడిన యుగంధర్ ప్రసాద్

పాకాల, జూన్ 27: పాకాల మండల వైసీపీ యువజన విభాగ అధ్యక్షుడు ఎం.యుగంధర్ ప్రసాద్ (చంటి)పై గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. చెన్నుగారిపల్లె సమీపంలోని తన ఇంట్లో ఉండగా సుమారు 10 మంది బీరు బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో యుగంధర్ ప్రసాద్‌కు తీవ్ర గాయాలవడంతో చికిత్సకోసం తిరుపతికి తరలించారు.

పెద్దశేషవాహనంపై సుందరరాజస్వామి అభయం

● వైభవంగా అవతార మహోత్సవాలు ప్రారంభం


పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

తిరుచానూరు, జూన్ 27: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న సుందరరాజస్వామి వారి అవతార మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం కేటీ ముఖమండపంలో ఉత్సవర్లకు అభిషేకం, సాయంత్రం కృష్ణస్వామి ముఖమండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత సుందరరాజస్వామి పెద్ద శేషవాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి, భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, శేషగిరి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

బద్దలవుతున్న పెద్దిరెడ్డి కంచుకోట

● పుంగనూరు మున్సిపాలిటీలో సడలిన పట్టు
● టీడీపీలో చేరనున్న పలువురు కౌన్సిలర్లు, నేతలు
● ఎమ్మెల్యేగా గెలిచినా పుంగనూరుకు రాలేని పరిస్థితి

పెద్దిరెడ్డీ గో బ్యాక్ అంటూ ఈనెల 15న టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. దీంతో తన పుంగనూరు పర్యటనను ఎమ్మెల్యే వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

పదవులు ఇచ్చి పవర్ తీసేసుకున్నారంటూ మున్సిపల్ చైర్మన్, మరో పది మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. మరికొందరితో కలిసి త్వరలో టీడీపీలో చేరనున్నారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన ఈ రెండు పరిణామాలు నియోజకవర్గంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టు సడలుతోందనేందుకు నిదర్శనాలు.


పెద్దిరెడ్డీ గో బ్యాక్ అంటూ ఈనెల 15వ తేదీన పుంగనూరులో నిరసన చేపట్టిన టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జూన్ 27: పుంగనూరులో ప్రత్యర్థులు ఎదురుతిరగకుండా గత 15 ఏళ్లుగా నిర్మించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సామ్రాజ్యపు కంచుకోట బద్దలవుతోంది. ఊహించని విధంగా సార్వత్రిక ఎన్నికల్లో చావు తప్పి కన్నులొట్ట పోయినట్లు స్వల్ప ఆధిక్యతతో పుంగనూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా ఆయన నాలుగోసారి గెలుపొందారు. వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయాలను, అధికారాన్ని శాసిస్తూ పార్టీ, ప్రభుత్వంలో ఎదురులేని వారిగా చెలామణి అయ్యారు. గతంలో పెద్దిరెడ్డి ఆదేశాలను శిరసావహిస్తూ నాటి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్‌ఐలు, కొందరు రెవెన్యూ, మున్సిపల్, సబ్‌రిజిస్ట్రార్, తదితర అధికారులు ప్రతిపక్షాలకు చెందిన వారిని ఇబ్బంది పెడుతూ చుక్కలు చూపించారు. ప్రత్యక్ష, పరోక్షంగా బెదిరింపులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టారు. తెలుగుదేశంపార్టీ జెండా పట్టుకోవాలన్నా వణికేలా చేశారు. అన్యాయాలను ప్రశ్నించే ధైర్యంలేక టీడీపీ శ్రేణులు కుమిలిపోతూ ఆందోళన చెందుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రజలు ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి బ్రహ్మరథం పట్టారు. ఇక పుంగనూరులో అయితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓడి గెలిచినట్లయింది. ఎందుకంటే 2009 ఎన్నికల్లో 40,299.. 2014లో 31,731.. 2019లో 43,222 ఓట్ల మెజారిటీతో పుంగనూరు నుంచి గెలిచిన ఆయనకు, ఇప్పుడు కేవలం ఆరు వేల ఓట్ల ఆధిక్యత మాత్రమే వచ్చింది.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో.. 15 ఏళ్లుగా కుమిలిపోయిన పుంగనూరు పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గతేడాది చంద్రబాబు నాయుడిని పుంగనూరులోకి రాకుండా అడ్డుపడిన పెద్దిరెడ్డిని ప్రస్తుతం తామూ రానివ్వబోమని ఎదురుతిరిగారు. ఈ నేపథ్యంలో పుంగనూరులో వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన వస్తున్నారనే సమాచారంతో ఈనెల 15న టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పెద్దిరెడ్డి గోబ్యాక్ అంటూ నిరసనకు దిగాయి. దీంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుంచి పుంగనూరుకు రాలేని పరిస్థితితో వాయిదా వేసుకున్నారు. గతంలో కుప్పంలో ఎమ్మెల్యేగా చంద్రబాబునాయుడును పర్యటించకుండా అడ్డుకోవడం, అలాగే పుంగనూరులో పలువురిని అడ్డుకుని ఇబ్బందులుపెట్టిన పెద్దిరెడ్డి ప్రస్తుతం సొంత నియోజకవర్గమైన పుంగనూరుకు రాలేకపోతున్న సంఘటన నెలకొంది. అప్పట్లో టీడీపీ శ్రేణులు, నాయకులపై అక్రమకేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడంలో అతిగా వ్యవహరించిన పలువురు వైసీపీ నేతలు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటికీ స్వస్థలాలకు దూరంగా ఉన్నారు.

పెద్దిరెడ్డి రాజకీయ అంతం మొదలైంది: చల్లా

అధికారమదంతో ప్రజలను దోపిడీ చేస్తూ అరాచకం మొదలు పెట్టిన పుంగనూరు నుంచే పెద్దిరెడ్డి రాజకీయ అంతం కూడా మొదలైందని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మంచిపనులు, అభివృద్ధి చేసి దగ్గర కాకుండా దౌర్జన్యం, అరాచకాలు, దోపిడీ, అక్రమాలతో భయపెట్టి కాలం గడిపే రోజులు ఇక సాగవని హెచ్చరించారు. ఇప్పుడు పుంగనూరులో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోందని, పెద్దిరెడ్డి అక్రమాలు, అవినీతి చిట్టా విప్పి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తే ఎంతటి నాయకుడైనా మట్టికరవక తప్పదన్నారు.


ఇక టీడీపీతో నడుస్తామంటూ వైసీపీకి రాజీనామా చేసి చల్లాను కలిసిన కౌన్సిలర్లు

పదవులిచ్చి పవర్ లాగేసుకున్నారు

● సొంతపార్టీ నేతలపై కౌన్సిలరు విమర్శ ● వైసీపీకి 11 మంది రాజీనామా

రొంపిచెర్ల, జూన్ 27: 'మాకు వైసీపీ నేతలు పదవులిచ్చారు. కానీ పవర్ లాగేసుకున్నారు' ఇదీ ఓ కౌన్సిలరు విమర్శ. పుంగనూరులో వైసీపీ నేతల వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, 8, 1, 2, 3, 16, 27, 13, 15, 18వ వార్డు కౌన్సిలర్లు రహంతుల్లా (అమ్ము), ఎం.రామక్రిష్ణమరాజు, జె.నరసింహులు, యువకుమారి, మమత, వి.కళిదాసు మొదలియార్, ఖాన్‌నూర్జహాన్, కసురున్నీషా, మనోహర్, రేష్మ గురువారం వైసీపీకి రాజీనామాలు చేశారు. రొంపిచెర్లలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి చేరుకుని ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ.. తాము పదవుల్లో వున్నా పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డితో పట్టణం అభివృద్ధి జరుగుతుందని ఆశాభావంతో తాము వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. తాము ఏ పోలీసు కేసులకు భయపడి రావడంలేదని, కేవలం అభివృద్ధే లక్ష్యంగా వస్తున్నట్లు స్పష్టంచేశారు. వైసీపీ నాయకులు పదవులు ఇచ్చి పవర్ లాగేసుకున్నారని కౌన్సిలర్ అమ్ము తీవ్ర విమర్శచేశారు.

చంద్రబాబు అభివృద్ధికి.. వ ౦ ౦ త్రి

నారా లోకేశ్ యువతకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆకర్షితులై తాము టీడీపీలో చేరడానికి సిద్ధపడ్డామన్నారు. అభివృద్ధికోసం మనమంతా కష్టపడి పనిచేద్దామని చల్లా రామచంద్రారెడ్డి వారికి చెప్పారు. 25 సంవత్సరాలుగా వైసీపీ నాయకులు కుటుంబ పాలనతో అధికారం తన వద్ద పెట్టుకుని ఆడించారన్నారు. పుంగనూరులో ముస్లింలను ఎన్‌డీఏకి ఓట్లు వేయవద్దని చెప్పారని.. పార్లమెంటులో మాత్రం ఎన్‌డీఏకి ఎంపీ మిథున్‌రెడ్డి మద్దతు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తండ్రీ కొడుకుల ఆటలు ఇక సాగవని, వారి చిట్టాలు బయట పెడతామన్నారు. ఎప్పుడూ న్యాయమే గెలుస్తుందన్నారు. పుంగనూరు అభివృద్ధికి సహకరించాలని కుప్పంలో సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. అన్ని డెయిరీలను నియోజకవర్గంలోకి రప్పించి రైతులకు పాల ధర లీటరుకు రూ.40 ఇప్పిస్తానని, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కోసం చర్యలు తీసుకొంటానని, అక్రమ క్వారీలు అరికట్టి.. టీడీపీ వర్గీయుల నుంచి లాక్కొన్న వాటిని తిరిగి వారికే చెందేలా చేస్తానని తెలిపారు.

సొంత పార్టీలోనూ.. : ఇంతకాలం అధికార భయంతో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా వైసీపీలోనూ నోరు తెరిచిన వాళ్లు లేరు. ఆయన తీరుపై అసంతృప్తి ఉన్నా పైకి చెప్పుకోలేని పరిస్థితి. ఇప్పుడూ వీళ్లూ నెమ్మదిగా మాట్లాడటం మొదలు పెట్టారు. గురువారమైతే ఏకంగా మున్సిపల్ చైర్మన్, మరో పదిమంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా త్వరలో టీడీపీలో చేరనున్నారు. మరికొందరు కౌన్సిలర్లూ పార్టీ మారబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ ఐదేళ్ల కాలం మున్సిపాలిటీలో అధికారం చెలాయించే అవకాశాన్ని పెద్దిరెడ్డి కోల్పోనున్నారు. మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు, నియోజవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నేతలూ టీడీపీవైపు చూస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి త్వరలో పుంగనూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మరికొందరు వైసీపీని వీడనున్నట్లు సమాచారం.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.38 కోట్లు

తిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.38 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 77,332మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,540 మంది తలనీలాలు సమర్పించారు.

డాక్టరేట్ ప్రదానం


సురేష్‌బాబు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 27: ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం పరిశోధక విద్యార్థి సురేష్‌బాబు పోట్లదుర్తికి పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు సీఈవో దామ్లానాయక్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పెర్ఫార్మెన్స్ ఎనాలిసిస్ ఆఫ్ ఎంఎస్‌టీ రాడార్ డేటా యూజింగ్ వేరియస్ వేవ్లెట్స్ విత్ ఓవర్లాప్డ్ గ్రూప్ శ్రంకేజ్ అనే అంశంపై పరిశోధనాగ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశామని తెలిపారు. ఈయన కరకంబాడీరోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డితోపాటు పలువురు అధ్యాపకులు అభినందించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు హేమాన్ష్ క్రితిక్ ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), జూన్ 27: స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో 4వతరగతి చదివే విద్యార్థి టి.హేమాన్ష్ క్రితిక్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని శాతవాహన జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓపెన్ అండర్-10 ఏపీ రాష్ట్ర విలువిద్య పోటీల్లో రికర్వ్ విభాగంలో ప్రతిభచాటి జాతీయ స్థాయికి అర్హత సాధించాడని తెలిపారు. విద్యార్థిని కరస్పాండెంట్ ఎస్.విశ్వతులసి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, కోచ్ టి.ధనంజయులు, టీచర్లు అభినందించారు.

చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

తిరుపతి(లీగల్), జూన్ 27: చెక్కు బౌన్స్ కేసులో తిరుపతి ఎంఆర్‌పల్లె వాసవీనగర్‌కు చెందిన డెంటల్ డాక్టర్ పవిత్రకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5వేలు జరిమాన విధిస్తూ రెండవ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి పి.కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. 2019 ఏప్రిల్ 15న తిరుపతి డీఆర్ మహల్ రాజారెడ్డి కాలనీలో కాపురం ఉన్న ఎం.మౌనిక వద్ద డాక్టర్ పవిత్ర రూ.5లక్షలు నగదుఅప్పుగా తీసుకుంది. అప్పుచెల్లించే క్రమంలో 2019 సెప్టెంబరు 17న రూ.1.5లక్షలకు చెక్కు ఇచ్చింది. చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో మౌనిక న్యాయవాది ఎం.మురళిని సంప్రదించి తిరుపతిలో చెక్కుబౌన్స్ కేసు దాఖలు చేసింది. కేసు నిరూపణ కావడంతో డాక్టర్ పవిత్రకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానతో పాటు చెక్కుపరిహారం రూ.3లక్షలు చెల్లించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 27: ఎంఆర్‌పల్లెలోని హథీరాంజీ కాలనీలో పార్కింగ్ చేసి ఉన్న ఓ కారులో గురువారం మధ్యాహ్నం హఠాత్తుగా మంటలు చెలరేగాయి. పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక దళం మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అప్పటికే కారు ముందుభాగం దగ్ధమైంది. కారు యజమాని మాట్లాడుతూ కొన్ని రోజులుగా కారు పార్కింగ్‌లోనే ఉందని, మంటలు ఎలా వ్యాపించాయో తెలియరావడం లేదని, ఒకవేళ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఉండవచ్చని చెప్పుకొచ్చారు.

సచివాలయానికి సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు



తిరుపతి (జీవకోన), జూన్ 27: తిరుపతి నగర పరిధిలోని 50వ డివిజన్ సచివాలయానికి స్థానిక టీడీపీ, జనసేన నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను అందజేశారు. అనంతరం ఆ చిత్రపటాలను కార్యాలయంలో ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు కాయం వెంకటరత్నం, మహేశ్వరరావు, కరణం హేమంత్, విజయ్, బాబు, షణ్ముగం, బాబు, జనసేన నాయకులు మధులత, ధరణి, శిరీష, రవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి-పూర్ణా ప్రత్యేక రైలు వేళల్లో మార్పులు

తిరుపతి(సెంట్రల్), జూన్ 27: తిరుపతి-పూర్ణా రైల్వే స్టేషన్ల మధ్య నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(07610) బయలుదేరు వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతిలో ఈ రైలు ప్రతి మంగళవారం సాయంత్రం 4 గంటలకు బయలుదేరి రేణిగుంట, గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ, సికింద్రాబాదు, లింగంపల్లి, వికారాబాదు, బీదర్‌ల మీదుగా బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు పూర్ణా చేరుకొంటుందని ఆయన తెలిపారు.

షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం


కలశ పూజలు చేస్తున్న గంగరాజు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 27: తిరుచానూరు మార్గంలోని శ్రీనివాసపురంలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం 5 గంటలకు బాబాకు కాకడ హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిధిలో వున్న పరివార దేవతలకు పూజలు చేశారు. ధర్మకర్త వేల్పుల గంగరాజు, లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూదమాడుతున్న ఆరుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27: తిరుపతి మున్సిపల్ పార్కువెనుక జూదమాడుతున్న ఆరుగురిని అలిపిరి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ప్రకాశం పార్కు వెనుక జీవకోనకు చెందిన శశికుమార్, ఏ.మనోహర్, కె.రమేష్, క్రాంతినగర్‌కు చెందిన సతీష్, తూర్పుగోదావరికి చెందిన జగదీష్‌కుమార్, అనంతపురానికి చెందిన శివ జూదం ఆడుతుండగా సీఐ రామారావు, ఎస్‌ఐ రామస్వామి సిబ్బందితో దాడి చేశారు. వారి వద్ద దాదాపు రూ.33,400 స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రామస్వామి చెప్పారు.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం సహా నిందితుడితో అటవీ సిబ్బంది

ఎర్రచందనం స్వాధీనం

భాకరాపేట, జూన్ 27: ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు ఫారెస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం చామల వెస్ట్ బీట్ బొమ్మాజీకొండ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా.. ఎర్రచందనం తీసుకువస్తూ అటవీ సిబ్బందిని చూసి దుంగలు పడేసి పారిపోతుండగా తమిళనాడుకు చెందిన శక్తివేల్ రామస్వామిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ గాలించగా సమీపంలో ఉన్న 124 కిలోల బరువు గల ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు లోకనాథం, సదాశివయ్య, రెడ్డప్పరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీలో జేఆర్ఎఫ్‌కి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 27: పద్మావతి మహిళా వర్సిటీలో డీఆర్‌డీవో స్పాన్సర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఆఫ్ నానో ఎన్ క్యాప్సులేటర్ నాచురల్ యాంటీ మైక్రోబియల్స్ ఫర్ ఫుడ్ ప్రిజర్వేషన్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు తమ దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా ఈమెయిల్ ద్వారాగానీ పంపాలని నిర్వాహకులు కోరారు. పూర్తివివరాలకోసం ఎస్పీఎంవీవీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ని సంప్రదించాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి


తిరుపతిలో ట్రాఫిక్ తీరుపై పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 27: నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండటం.... భక్తులు, స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆకస్మిక తనిఖీలు చేశారు.ఎస్పీ ట్రాఫిక్ పాయింట్లు పరిశీలిస్తున్నారని తెలుసుకున్న డీఎస్పీలు రమణకుమార్, రవిమనోహరాచారి, సీఐలు అక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం 11గంటల నుంచి 12.30గంటల వరకు గాంధీరోడ్డు, చిన్నబజారు వీధి, తీర్థకట్టవీధి, బండ్లవీధి, కర్నాల వీధి, బేరివీధి, గోవిందరాజస్వామి ఉత్తర మాడ వీధి, గుడివెనుక, రైల్వే స్టేషన్ సర్కిల్, కృష్ణాపురం ఠాణా జంక్షన్ ప్రాంతాల్లో ప్రయాణికులు ట్రాఫిక్‌లో పడుతున్న ఇబ్బందులను నేరుగా పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వాహనాలు ఆపి ఉండటం, వన్‌వే సరిగా అమలు కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు.వన్‌వే కఠినంగా అమలుచేయాలని, ట్రాఫిక్ మళ్లింపు సూచికలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. తిలక్‌రోడ్డులో ట్రాఫిక్‌ను దారిలో పెట్టాలని సూచించారు. ఆటోలను పార్కింగ్ ప్రదేశాల్లో ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేయించాలని డీఎస్పీని ఆదేశించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే పులివర్తి నాని


పాకాలలో పులివర్తి నానికి స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

పాకాల, జూన్ 27: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో తాగునీటి సమస్యపై సమీక్షించారు. గ్రామాల వారీగా నీటి లభ్యత అంచనా వేసి సమస్య వున్న చోట వెంటనే ట్యాంకర్లతో సరఫరా చేయాలన్నారు. మూడు నెలల్లో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. వర్షాకాలంలో విషజ్వరాలు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయాలని, మురుగునీటి కాలువల్లో వ్యర్థ జలాలు పేరుకుపోకుండా శుభ్రం చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులపై చర్చించారు. ఈవోపీఆర్డీ మాలతి, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరమణ, ఏఈ నందకిశోర్, ఎంపీడీవో కార్యాలయ ఏవో కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి మోతీ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేకి ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి


దివ్యాంగులకు ఫ్యాన్ అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి (జీవకోన), జూన్ 27: మానసిక, శారీరక వికలాంగులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత ఆడమ్స్ కెల్లర్ జయంతి సందర్భంగా జీవకోనలోని విశ్వం స్కూల్‌లో దీన జనసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దీన జనసేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరుపులు, ఫ్యాన్లు తదితర నిత్యావసరాలను వితరణగా అందజేశారు.

ప్రత్యేక ఆకర్షణగా శునకం విన్యాసాలు

దీన జన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా జూనియర్ కిట్టు భైరవ(శునకం) చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు మరో ముగ్గురు వ్యక్తులను శునకం చుట్టూ కూర్చోబెట్టి వారి పేర్లను ప్రస్తావించగానే.. వెంటనే వారి వద్దకు వెళ్లడం అబ్బురపరిచింది. దీన జన సేవా సమితి నిర్వాహకులు కేవీ పవిత్రన్, జనసేన తిరుపతి పరిశీలకులు వెంకటేశ్వరరావు, టీడీపీ కార్పొరేటర్ అన్నా సంధ్య, ఇస్కాన్ కార్యదర్శి లీలా పారాయణ ప్రభూజీ, విశ్వం స్కూల్ చైర్మన్ విశ్వచందన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కుమారమ్మ, జనసేన యువ నాయకులు భాను, బండ్ల లక్ష్మీపతి, నిర్వాహకులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి

బుద్ధుని ప్రవచనం పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్) జూన్ 27: అనేక వందల సంవత్సరాల క్రితమే గౌతమ బుద్ధుడు సమాజంలోని హింస, అక్రమాలు, వైరుధ్యాలను ప్రశ్నించాడని పలువురు వక్తలు పేర్కొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్తంగా గురువారం సాయంత్రం ప్రముఖ పౌరహక్కుల నేత బొజ్జా తారకం 85వ జయంతిని నిర్వహించాయి. ఈ సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో తొలుత బొజ్జా తారకం చిత్రపటానికి ఆహుతులు నివాళి అర్పించారు. అనంతరం రిపబ్లికన్ పార్టీ అధినేత పూతలపట్టు అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో బొజ్జాతారకం రచించిన బుద్ధుని ప్రవచనం పుస్తకాన్ని ముఖ్యఅతిథి, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి. గురప్ప ఆవిష్కరించారు. సభలో సీనియర్ పాత్రికేయులు రాఘవ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ప్రముఖ రచయిత గొడుగుచింత గోవిందయ్య, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, రచయిత్రి సుభద్ర తదితరులు పాల్గొన్నారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు మల్లేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ సభలో పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం

తిరుపతి(వైద్యం), జూన్ 27: స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో గురువారం వైద్య అధ్యాపకులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఎప్పటికప్పుడు మారుతున్న నూతన అధ్యయనాలను తెలుసుకుంటూ.. వాటిల్లోని మెలకువలతో రోగులకు చక్కటి వైద్య సేవలు అందించాలంటే వైద్యులకు ఇటువంటి నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వైద్యరంగంలో చోటుచేసుకుంటున్న అనేక మార్పులు, నూతన అధ్యాయనాలపై ఆయన వైద్య అధ్యాపకులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, సునీత పాల్గొన్నారు.

మధుమేహంతో బాధపడే వారిలో గ్లకోమా వచ్చే అవకాశాలు ఎక్కువ


రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి(వైద్యం), జూన్ 27: మధుమేహంతో బాధపడే వారిలో గ్లకోమా అనే నీటి కాసుల కంటి వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, దీంతో వీరు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుధారాణి అన్నారు. స్థానిక తిలక్‌రోడ్డులోని శ్రీసాయిసుధా కంటి ఆస్పత్రిలో ఆమె గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రక్తంలో చక్కెర స్థాయి పెరిగినప్పుడు రెటీనాలోని రక్తనాళాలు దెబ్బతిని కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. అనంతరం సుమారు 50 మంది రోగులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి భద్రతకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది హిమబిందు, చిట్టెమ్మ, మహేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో అదనపు మండలాల ఏర్పాటుకు కమిటీ

కుప్పం, జూన్ 27: కుప్పం రెవెన్యూ డివిజన్‌లో అదనంగా రెండు మండలాల ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఓ కమిటీని నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యదర్శి ప్రద్యుమ్న ఈనెల 24వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో పర్యటించిన సీఎం.. ప్రస్తుతమున్న నాలుగు మండలాలు కాకుండా అదనంగా కుప్పం మండలంలోని మల్లానూరు, శాంతిపురం మండలంలోని రాళ్లబూదుగూరు ప్రాంతాలను మండలాలుగా ఏర్పాటు చేసే విషయంలో నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే, ఈ పర్యటనకు ఒకరోజు ముందే దీనిపై కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. అంటే సొంత నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి స్థానిక ఎమ్మెల్యే కూడా అయిన చంద్రబాబు ఎంత ప్రాధాన్యమిస్తున్నారన్న విషయాన్ని ఈ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి. వీలైనంత త్వరలోనే ప్రస్తుతమున్న కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు అదనంగా మల్లానూరు, రాళ్లబూదుగూరు మండలాలతో కుప్పం రెవెన్యూ డివిజన్‌లోని మండలాల సంఖ్య ఆరుకు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికార యంత్రాంగం అభిప్రాయపడుతోంది.

పేదల ప్రాణాలతో చెలగాటం ఆడతారా?

● ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణపై డీసీహెచ్‌ఎస్ ఆగ్రహం


ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, జూన్ 27: పీజీ డాక్టర్లతో వైద్యం చేయిస్తూ పేదల ప్రాణాలతో చెలగాటం ఆడతారా అని డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో డయేరియా బాధితులకు అందిస్తున్న వైద్యసేవలను గురువారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో అధ్వాన పరిస్థితులను గుర్తించారు. చికిత్స అందిస్తున్న వార్డులో మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, తాగునీటి వసతి కూడా సరిగా లేదని డయేరియా బాధితులు చెప్పారు. జనరేటర్ సౌకర్యం లేక రాత్రి వేళ దోమలతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ తూర్పు మండలాల్లో డయేరియాపై ఆస్పత్రి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రి నిర్వహణపై నిత్యం ఫిర్యాదులు రావడం బాధాకరమన్నారు. రికార్డుల పనులకు స్టాఫ్ నర్సులను ఎందుకు కేటాయించారంటూ అధికారులను ఆరాతీశారు. ఇటీవల ప్రభుత్వం పదిమంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల(డీఈవో), మరో పదిమంది జనరల్ డ్యూటీ అసిస్టెంట్ల(జేడీఏ)ను నియమించిందన్నారు. వారంతా ఏ పనులు చేస్తున్నారని నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. అత్యవసర ఆపరేషన్లు నిర్వహించకుండా రెఫర్ చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ మధు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇమాం పసంద్ టన్ను రూ.3 లక్షలు!



బంగారుపాళ్యం, జూన్ 27: బంగారుపాళ్యం మార్కెట్‌లో గురువారం మేలైన ఇమాం పసంద్ మామిడి టన్ను రూ.3లక్షలు పలికింది. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులోని నూర్‌బాయి మండీకి పలమనేరు మండలం రంగనాయనిపల్లికి చెందిన నారాయణశెట్టి ఒకటిన్నర టన్ను ఇమాం పసంద్‌ను తీసుకురాగా, మండీ యజమానులు వేలం పాట నిర్వహించారు. చెన్నైకి చెందిన వ్యాపారులు కేజీ రూ.300కు కొనుగోలు చేశారు. కాగా టేబుల్ రకాలైన బేనీషా కిలో రూ.30 - రూ.110, మల్లిక రూ.40 - రూ.100, కాలేపాడు రూ.30 - రూ.70, నీలం రకం మామిడి రూ.30 నుంచి రూ.70 వరకు, మేలైన కలర్ తోతాపురి కిలో రూ.30 - రూ.43, నాటి రకాలు రూ.15 - రూ.22 ధర పలికాయి. కాగా గుజ్జు పరిశ్రమకు తరలించే తోతాపురి రకం కేజీ రూ.24 పలికింది. ఇమాం పసంద్‌కు మంచి ధర రావడంతో రైతు నారాయణశెట్టి ఆనందం వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్స్, ఓనర్స్‌ను ఇబ్బంది పెట్టొద్దు

తిరుపతి అర్బన్, జూన్ 27: స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంత ఆటో యూనియన్స్ సభ్యులు గురువారం ఎన్జీవో కాలనీలోని నివాసంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు చెప్పుకున్నారు.

ఎమ్మెల్యే ఆరణికి ఘన సత్కారం



తిరుపతి అర్బన్, జూన్ 27: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గురువారం ఘనంగా సత్కరించింది. స్థానిక ఎన్జీవో కాలనీలోని ఆయన నివాసంలో టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు, పలు విభాగాల సంఘాల నాయకులు కూడా మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాలువకప్పి లడ్డూప్రసాదాలను అందజేశారు. టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్, మదన్‌మోహన్, చిన్నాంగారి సూరి, సునీల్‌కుమార్ యాదవ్, శ్రీహరి, రేఖ, వంకీపురం పవన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన ఉద్యోగ సంఘ నాయకులు



తిరుమల, జూన్27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా బాధ్యతలు తీసుకున్న శ్యామలరావును గురువారం ఉద్యోగ సంఘాల నాయకులు కలిశారు. తిరుపతి పరిపాలన భవనంలో టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పట్టువస్త్రంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతమున్న సమస్యలను పరిష్కరించాలని ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. నాయకులు గోల్కొండ వెంకటేశం, గుణశేఖర్, వెంకటరమణ, రత్నప్రభాకర్, హేమచంద్రబాబు, చలపతి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ఈవోను కలసిన బీసీ ఉద్యోగులు



తిరుపతి అర్బన్: స్థానిక పరిపాలన భవనంలో టీటీడీ బీసీ ఉద్యోగ సంఘం నాయకులు గురువారం ఈవో శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలసారు. శాలువకప్పి ఘనంగా సన్మానించారు. టీటీడీలో బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈవో దృష్టికి తీసుకెళ్లారు. రాజకుమార్, రవీంద్రబాబు, కామరాజు, భరత్‌కుమార్, రామచంద్ర, మునికుమార్ పాల్గొన్నారు.

లా సెట్‌లో 86, 313 ర్యాంకులు


గంగాధర్, లారెన్స్‌ను అభినందిస్తున్న ప్రకాష్‌బాబు

తిరుపతి(విద్య), జూన్ 27: తిరుపతికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఏపీ లా సెట్‌లో మంచి మార్కులు తెచ్చుకుని రాష్ట్రస్థాయిలో 86, 313 ర్యాంకులను సాధించారు. ఆంధ్రప్రదేశ్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ లాసెట్)-2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఏపీ ఉన్నత విద్యామండలి పర్యవేక్షణలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన ఏపీ లాసెట్ ఆన్‌లైన్ విధానంలో జరిగింది. ఈ పరీక్షలో తిరుపతి టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎల్.గంగాధర్, 86వ ర్యాంకు, వి.లారెన్స్ 313వ ర్యాంకు సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ సిలబస్‌తోపాటు పోటీ పరీక్షలకు ఇచ్చిన శిక్షణ లాసెట్‌లో మంచి ర్యాంకులు సాధించేందుకు ఉపకరించిందని విద్యార్థులు చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.58 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సూళ్లూరుపేట, జూన్ 27: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భక్తులు హుండీలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం 105 రోజులకుగాను రూ.58,51,539 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ తెలిపారు. ఇవే కాకుండా యుఎస్‌ఏకు చెందిన డాలర్స్ 27, యుఏఈ దిర్హామ్స్ 5, మలేషియా రిగ్గింట్-1, సింగపూర్ డాలర్ 10, ఇంగ్లాండ్ ఫౌండ్ 5తోపాటు 45 గ్రాముల బంగారు, వెండి 120 గ్రాములు హుండీలో కానుకలో రూపంలో భక్తులు వేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంత బ్యాంకు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



తడ, జూన్ 27 : పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు సమక్షంలో ఈ నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. తడ బాలికోన్నత పాఠశాలలో 14 మందికి, బాలుర ఉన్నత పాఠశాలలో ఒకరికి, చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో ఒకరు, వాటంబేడు పాఠశాలలో ఇద్దరికి, ఆదర్శ పాఠశాలలో 9 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు 5,116 రూ, 4116రూ, 3116రూ, మిగిలిన వారికి రూ.2,116, రూ.1,116 చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సురేష్, ఆలపాటి అశోక్‌కుమార్, రత్నబాలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జూన్ 26: కార్యకర్తలకు అండగా ఉంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అభ్యర్థులు ఇప్పటి వరకు కలిసే పోరాటాలు చేస్తున్నామన్నారు. ఓటమికి కారణాలు పరిశీలించుకుని సరిదిద్దుకుంటామని తెలిపారు. అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్సీ మేరిగ మురళి మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదరించిన పార్టీకి అన్యాయం చేయకుంటే మంచిదని స్పష్టం చేశారు. ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, మాజీ ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెళ్లకూరు, జూన్ 27 : మండలంలోని పుల్లూరు, కలవకూరు గ్రామ సమీపంలో స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున నాయుడుపేట సీఐ జగన్‌మోహన్‌రావు దాడులు చేసి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కలవకూరు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సీఐ తన సిబ్బందితో దాడులు చేసి రెండు ట్రాక్టర్లను, ఇద్దరు డ్రైవర్లను పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

గురుకులంలో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలు

చిల్లకూరు, జూన్ 27: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతులలో మిగులు సీట్ల భర్తీకి గురువారం ఆ పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 225 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 183 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మీరాసాహెబ్ తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దొరవారిసత్రం, జూన్ 27 : దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన రైతు సదస్సుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరై మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలో ఆగిపోయి ఉన్న తెలుగు గంగ కాలువ పనులు పూర్తి చేయించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏవోలు కవిత, కాంచన, జ్యోతిర్మయి, ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, ఉప మండలాధ్యక్షుడు దువ్వూరు గోపాల్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంఈవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నాయుడుపేటటౌన్, జూన్27 : నాయుడుపేట మండలం బిరదవాడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని గురువారం టీడీపీ జిల్లా కార్యదర్శి బిరదవాడ నారాయణ, ప్రధాన కార్యదర్శి నానాబాల సుబ్బారావు, పట్టణ కార్యదర్శి మల్లాం రవికుమార్ అందజేశారు.

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 27 : రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు ప్రభుత్వం 200 యూనిట్లు కరెంటు ఫ్రీగా ఇస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని 4వ వార్డులో చేనేతలకు సబ్సిడీపై మంజూరు అయిన స్టాండు మగ్గాలను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు చేనేతలకు ఇచ్చిన హామీలు ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తూచా తప్పకుండా అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు.

● నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇటీవల తన భర్తను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ హతుడు బొక్కిసం రవి భార్య మునెమ్మ ఎమ్మెల్యే రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. తన భర్త హత్యతో తాను, తన ఇద్దరు పిల్లలు అనాథలయ్యామని ఆమె కన్నీటి పర్యంతం మయ్యారు. దీంతో చలించిన రామకృష్ణ పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టులో చేర్పించి వారిని ఉన్నత చదువులు చదివించే బాధ్యతను తాను తీసుకొంటానని ఆమెకు హామీ ఇవ్వడంతో పాటు మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి ఆమె విద్యార్హతకు తగిన ఉపాధి అవకాశం కల్పించాలని సూచించారు. రవిని దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

● చిన్నారికి ఎమ్మెల్యే అభినందనలు

రాష్ట్ర, జాతీయ స్థాయి విలు విద్య పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించిన 4వ వార్డుకు చెందిన 4వ తరగతి విద్యార్థి గీర్వాణ్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో చేనేత శాఖ అధికారులు విశ్వేశ్వరరావు, ఢిల్లీబాబు, మున్సిపల్ కమిషనర్ రషీద్, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, గొల్లగుంట మురళీకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, జింకా బాలసుబ్రమణ్యం, పెద్ద వెంకటముని, మంకు ఆనంద్, 3వ వార్డు కౌన్సిలర్ పోట్టేళ్ళ ప్రభావతి, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు వున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

ఎమ్మెల్యే రామకృష్ణ

వెంక టగిరి, జూన్ 27 : వెంకటగిరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులకు సూచించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన ఇరిగేషన్, తెలుగుగంగ, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా వున్న తెలుగుగంగ బ్రాంచి కాలువ లు మరమ్మతులతో పాటు తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి గతంలో ప్రతిపాదించిన ప్రాంతాల్లో తూములు ఏర్పాటుకు మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈ రాధాకృష్ణను కోరారు. అంతేకాకుండా ఇరిగేషన్ అధికారులతో చెరువుల స్థితిగతులపై చర్చించారు. గత ప్రభుత్వం అడ్డగోలుగా చేపట్టిన పనుల వివరాలను తెలిపాలని కోరారు.. రోడ్ల దుస్థితి తెలుసుకొన్న ఎమ్మెల్యే రోడ్ల మర్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ శాఖ అధికారులకు చెప్పారు కార్యక్రమంలో తెలుగుగంగ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల ఈఈ, డీఈ, జేఈలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి



ఎస్టీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 27: గురుకుల పాఠశాలల్లో, వసతిగృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చెన్నూరులోని ఎస్టీ గురుకుల పాఠశాలను సందర్శించి వసతుల గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్టీ గురుకుల పాఠశాలలో కలుషిత నీటి సరఫరా కారణంగా విద్యార్థులు అస్వస్థతకు లోనైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారన్నారు. స్థానిక టీడీపీ నాయకులను పంపి విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, చాన్‌బాషా, వెంకటేశ్వర్లురాజు, మట్టం మురళి, పిట్టి నాగరాజు, మల్లికార్జున్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు కరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మధుసూదన్, కరుణాకర్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సూళ్లూరుపేట, జూన్ 27: సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అలవల రోటరీ కంటి వైద్యశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాత టైనీటాట్స్ పాఠశాల కరస్పాడెంట్ వేనాటి ధనుంజయ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 65 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి తిరుపతి లోని వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాలలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి పంపుతామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు అట్రంబాకం దశరథరెడ్డి తెలిపారు

టీడీపీ నేత కుటుంబానికి నెలవల పరామర్శ

ఓజిలి, జూన్27: ఓజిలి మండలం అత్తివరానికి చెందిన టీడీపీ నాయకుడు కనుమూరు గోపాల్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఇటీవల గోపాల్‌రెడ్డి సోదరుడు చిరంజీవిరెడ్డి మృతి చెందాడు. దీంతో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కుటుం బానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మధురెడ్డి, కట్టా రమణారెడ్డి, బి. రవీంద్రారెడ్డి ఉన్నారు.

● పుంగనూరు మున్సిపాలిటీలో సడలిన పట్టు
● టీడీపీలో చేరనున్న పలువురు కౌన్సిలర్లు, నేతలు
● ఎమ్మెల్యేగా గెలిచినా పుంగనూరుకు రాలేని పరిస్థితి

బద్దలవుతున్న పెద్దిరెడ్డి కంచుకోట

పెద్దిరెడ్డీ గో బ్యాక్ అంటూ ఈనెల 15న టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. దీంతో తన పుంగనూరు పర్యటనను ఎమ్మెల్యే వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

పదవులు ఇచ్చి పవర్ తీసేసుకున్నారంటూ మున్సిపల్ చైర్మన్, మరో పది మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. మరికొందరితో కలిసి త్వరలో టీడీపీలో చేరనున్నారు.



పెద్దిరెడ్డీ గో బ్యాక్ అంటూ ఈనెల 15వ తేదీన పుంగనూరులో నిరసన చేపట్టిన టీడీపీ శ్రేణులు

టీడీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన ఈ రెండు పరిణామాలు నియోజకవర్గంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టు సడలుతోందనేందుకు నిదర్శనాలు.

పుంగనూరు, జూన్ 27: పుంగనూరులో ప్రత్యర్థులు ఎదురుతిరగకుండా గత 15 ఏళ్లుగా నిర్మించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సామ్రాజ్యపు కంచుకోట బద్దలవుతోంది. ఊహించని విధంగా సార్వత్రిక ఎన్నికల్లో చావు తప్పి కన్నులొట్ట పోయినట్లు స్వల్ప ఆధిక్యతతో పుంగనూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా ఆయన నాలుగోసారి గెలుపొందారు. వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయాలను, అధికారాన్ని శాసిస్తూ పార్టీ, ప్రభుత్వంలో ఎదురులేని వారిగా చెలామణి అయ్యారు. గతంలో పెద్దిరెడ్డి ఆదేశాలను శిరసావహిస్తూ నాటి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్‌ఐలు, కొందరు రెవెన్యూ, మున్సిపల్, సబ్‌రిజిస్ట్రార్, తదితర అధికారులు ప్రతిపక్షాలకు చెందిన వారిని ఇబ్బంది పెడుతూ చుక్కలు చూపించారు. ప్రత్యక్ష, పరోక్షంగా బెదిరింపులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టారు. తెలుగుదేశంపార్టీ జెండా పట్టుకోవాలన్నా వణికేలా చేశారు. అన్యాయాలను ప్రశ్నించే ధైర్యం లేక టీడీపీ శ్రేణులు కుమిలిపోతూ ఆందోళన చెందుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రజలు ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి బ్రహ్మరథం పట్టారు. ఇక పుంగనూరులో అయితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓడి గెలిచినట్లయింది. ఎందుకంటే 2009 ఎన్నికల్లో 40,299.. 2014లో 31,731.. 2019లో 43,222 ఓట్ల మెజారిటీతో పుంగనూరు నుంచి గెలిచిన ఆయనకు, ఇప్పుడు కేవలం ఆరు వేల ఓట్ల ఆధిక్యత మాత్రమే వచ్చింది.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో.. 15 ఏళ్లుగా కుమిలిపోయిన పుంగనూరు పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గతేడాది చంద్రబాబు నాయుడిని పుంగనూరులోకి రాకుండా అడ్డుపడిన పెద్దిరెడ్డిని ప్రస్తుతం తామూ రానివ్వబోమని ఎదురుతిరిగారు. ఈ నేపథ్యంలో పుంగనూరులో వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన వస్తున్నారనే సమాచారంతో ఈనెల 15న టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పెద్దిరెడ్డి గోబ్యాక్ అంటూ నిరసనకు దిగాయి. దీంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుంచి పుంగనూరుకు రాలేని పరిస్థితితో వాయిదా వేసుకున్నారు. గతంలో కుప్పంలో ఎమ్మెల్యేగా చంద్రబాబునాయుడును పర్యటించకుండా అడ్డుకోవడం, అలాగే పుంగనూరులో పలువురిని అడ్డుకుని ఇబ్బందులు పెట్టిన పెద్దిరెడ్డి ప్రస్తుతం సొంత నియోజకవర్గమైన పుంగనూరుకు రాలేకపోతున్న సంఘటన నెలకొంది. అప్పట్లో టీడీపీ శ్రేణులు, నాయకులపై అక్రమకేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడంలో అతిగా వ్యవహరించిన పలువురు వైసీపీ నేతలు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటికీ స్వస్థలాలకు దూరంగా ఉన్నారు.

పెద్దిరెడ్డి రాజకీయ అంతం మొదలైంది: చల్లా

అధికారమదంతో ప్రజలను దోపిడీ చేస్తూ అరాచకం మొదలు పెట్టిన పుంగనూరు నుంచే పెద్దిరెడ్డి రాజకీయ అంతం కూడా మొదలైందని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మంచిపనులు, అభివృద్ధి చేసి దగ్గర కాకుండా దౌర్జన్యం, అరాచకాలు, దోపిడీ, అక్రమాలతో భయపెట్టి కాలం గడిపే రోజులు ఇక సాగవని హెచ్చరించారు. ఇప్పుడు పుంగనూరులో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోందని, పెద్దిరెడ్డి అక్రమాలు, అవినీతి చిట్టా విప్పి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తే ఎంతటి నాయకుడైనా మట్టికరవక తప్పదన్నారు.

సొంత పార్టీలోనూ..

ఇంతకాలం అధికార భయంతో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా వైసీపీలోనూ నోరు తెరిచిన వాళ్లు లేరు. ఆయన తీరుపై అసంతృప్తి ఉన్నా పైకి చెప్పుకోలేని పరిస్థితి. ఇప్పుడూ వీళ్లూ నెమ్మదిగా మాట్లాడటం మొదలు పెట్టారు. గురువారమైతే ఏకంగా మున్సిపల్ చైర్మన్, మరో పదిమంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా త్వరలో టీడీపీలో చేరనున్నారు. మరికొందరు కౌన్సిలర్లూ పార్టీ మారబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ ఐదేళ్ల కాలం మున్సిపాలిటీలో అధికారం చెలాయించే అవకాశాన్ని పెద్దిరెడ్డి కోల్పోనున్నారు. మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు, నియోజవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నేతలూ టీడీపీవైపు చూస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి త్వరలో పుంగనూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మరికొందరు వైసీపీని వీడనున్నట్లు సమాచారం.

ఇక టీడీపీతో నడుస్తామంటూ

వైసీపీకి రాజీనామా చేసి చల్లాను కలిసిన కౌన్సిలర్లు



పదవులిచ్చి పవర్ లాగేసుకున్నారు

● సొంతపార్టీ నేతలపై కౌన్సిలరు విమర్శ ● వైసీపీకి 11 మంది రాజీనామా


రొంపిచెర్ల, జూన్ 27: 'మాకు వైసీపీ నేతలు పదవులిచ్చారు. కానీ పవర్ లాగేసుకున్నారు' ఇదీ ఓ కౌన్సిలరు విమర్శ. పుంగనూరులో వైసీపీ నేతల వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, 8, 1, 2, 3, 16, 27, 13, 15, 18వ వార్డు కౌన్సిలర్లు రహంతుల్లా (అమ్ము), ఎం.రామక్రిష్ణమరాజు, జె.నరసింహులు, యువకుమారి, మమత, వి.కళిదాసు మొదలియార్, ఖాన్‌నూర్జహాన్, కసురున్నీషా, మనోహర్, రేష్మ గురువారం వైసీపీకి రాజీనామాలు చేశారు. రొంపిచెర్లలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి చేరుకుని ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ.. తాము పదవుల్లో వున్నా పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డితో పట్టణం అభివృద్ధి జరుగుతుందని ఆశాభావంతో తాము వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. తాము ఏ పోలీసు కేసులకు భయపడి రావడంలేదని, కేవలం అభివృద్ధే లక్ష్యంగా వస్తున్నట్లు స్పష్టంచేశారు. వైసీపీ నాయకులు పదవులు ఇచ్చి పవర్ లాగేసుకున్నారని కౌన్సిలర్ అమ్ము తీవ్ర విమర్శచేశారు.

చంద్రబాబు అభివృద్ధికి.. వ ం త్రి

నారా లోకేశ్ యువతకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆకర్షితులై తాము టీడీపీలో చేరడానికి సిద్ధపడ్డామన్నారు. అభివృద్ధికోసం మనమంతా కష్టపడి పనిచేద్దామని చల్లా రామచంద్రారెడ్డి వారికి చెప్పారు. 25 సంవత్సరాలుగా వైసీపీ నాయకులు కుటుంబ పాలనతో అధికారం తన వద్ద పెట్టుకుని ఆడించారన్నారు. పుంగనూరులో ముస్లింలను ఎన్‌డీఏకి ఓట్లు వేయవద్దని చెప్పారని.. పార్లమెంటులో మాత్రం ఎన్‌డీఏకి ఎంపీ మిథున్‌రెడ్డి మద్దతు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తండ్రీ కొడుకుల ఆటలు ఇక సాగవని, వారి చిట్టాలు బయట పెడతామన్నారు. ఎప్పుడూ న్యాయమే గెలుస్తుందన్నారు. పుంగనూరు అభివృద్ధికి సహకరించాలని కుప్పంలో సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. అన్ని డెయిరీలను నియోజకవర్గంలోకి రప్పించి రైతులకు పాల ధర లీటరుకు రూ.40 ఇప్పిస్తానని, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కోసం చర్యలు తీసుకొంటానని, అక్రమ క్వారీలు అరికట్టి.. టీడీపీ వర్గీయుల నుంచి లాక్కొన్న వాటిని తిరిగి వారికే చెందేలా చేస్తానని తెలిపారు.



ఇమాం పసంద్ టన్ను రూ.3 లక్షలు



బంగారుపాళ్యం, జూన్ 27: బంగారుపాళ్యం మార్కెట్‌లో గురువారం మేలైన ఇమాం పసంద్ మామిడి టన్ను రూ.3లక్షలు పలికింది. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులోని నూర్‌బాయి మండీకి పలమనేరు మండలం రంగనాయనిపల్లికి చెందిన నారాయణశెట్టి ఒకటిన్నర టన్ను ఇమాం పసంద్‌ను తీసుకురాగా, మండీ యజమానులు వేలం పాట నిర్వహించారు. చెన్నైకి చెందిన వ్యాపారులు కేజీ రూ.300కు కొనుగోలు చేశారు. కాగా టేబుల్ రకాలైన బేర్నిషా కిలో రూ.30 - రూ.110, మల్లిక రూ.40 - రూ.100, కాలేపాడు రూ.30 - రూ.70, నీలం రకం మామిడి రూ.30 నుంచి రూ.70 వరకు, మేలైన కలర్ తోతాపురి కిలో రూ.30 - రూ.43, నాటి రకాలు రూ.15 - రూ.22 ధర పలికాయి. కాగా గుజ్జు పరిశ్రమకు తరలించే తోతాపురి రకం కేజీ రూ.24 పలికింది. ఇమాం పసంద్‌కు మంచి ధర రావడంతో రైతు నారాయణశెట్టి ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి

బుద్ధుని ప్రవచనం పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్) జూన్ 27: అనేక వందల సంవత్సరాల క్రితమే గౌతమ బుద్ధుడు సమాజంలోని హింస, అక్రమాలు, వైరుద్యాలను ప్రశ్నించాడని పలువురు వక్తలు పేర్కొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం, దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్తంగా గురువారం సాయంత్రం ప్రముఖ పౌరహక్కుల నేత బొజ్జా తారకం 85వ జయంతిని నిర్వహించాయి. ఈ సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో తొలుత బొజ్జా తారకం చిత్రపటానికి ఆహుతులు నివాళి అర్పించారు. అనంతరం రిపబ్లికన్ పార్టీ అధినేత పూతలపట్టు అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో బొజ్జాతారకం రచించిన బుద్ధుని ప్రవచనం పుస్తకాన్ని ముఖ్యఅతిథి, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి. గురప్ప ఆవిష్కరించారు. సభలో సీనియర్ పాత్రికేయులు రాఘవ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ప్రముఖ రచయిత గొడుగుచింత గోవిందయ్య, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, రచయిత్రి సుభద్ర తదితరులు పాల్గొన్నారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు మల్లేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ సభలో పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 27: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేధో గురుదక్షిణా మూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కృతువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆహారాన్ని రుచిగా తయారు చేయాలి

కేవీబీపురం, జూన్ 27: చిన్నారులకు పెట్టే ఆహారాన్ని రుచికరంగా తయారు చేయాలని ఎంపీడీవో రెడ్డెయ్య అంగన్‌వాడీలకు సూచించారు. గురువారం మండలంలోని ప్రాథమికపాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మధ్యాహ్నం ఇచ్చే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ మునీశ్వరి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27: జంబుగోళంలో గురువారం ఓ వృద్ధురాలిని పిచ్చికుక్క కరిచింది. గాయపడిన పైహూరి సుబ్బమ్మను అసుపత్రికి తరలించారు. సంఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పిచ్చి కుక్క రెండు రోజుల నుంచి పశువులు, కోళ్లు, ప్రజలను కరుస్తోందని గ్రామస్తులు చెబుగున్నారు. ఈ కుక్కను పట్టుకుని కాపాడాలని వీరు అధికారులను కోరుతున్నారు.

పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27: వ్యవసాయ పంపుసెట్ల స్మార్ట్ మీటర్ల ప్రక్రియను తక్షణం రద్దు చేయాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో రైతులకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం డిప్యూటి తహసీల్దార్ చంద్రబాబునాయుడుకు అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి రవి, నాయకులు చంద్రమ్మ, చొక్కలింగం, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల స్వీకరణ


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 27: పల్లమాల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యలపై గురువారం ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి మాట్లాడుతూ విద్యుత్ లైన్ మరమ్మతులు, బిలుల్లో లోపాలు, మీటర్లు మార్పు తదితర సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. బీఎన్‌కండ్రిగ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌తో దేశభక్తి,సేవాభావం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్,ప్రధానోపాధ్యాయురాలు తదితరులు

శ్రీకాళహస్తి, జూన్ 27: స్కౌట్స్, గైడ్స్‌లో చేరి సేవాభావం, దేశభక్తి పెంపొందించుకోవాలని జిల్లా మున్సిపల్ కార్యాలయ కమిషనర్ రమేష్ బాబు విద్యార్థులను కోరారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ గైడ్స్ ఉద్యమ ప్రాధాన్యతను తెలిపే పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ కళాశాలలో రోవర్, రేంజర్ యూనిట్లను ప్రారంభించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్ శిక్షణ ద్వారా క్రమశిక్షణ కూడా పెంపొందుతుందన్నారు. జిల్లా యూత్ చైర్మన్ ఎస్కే అజారుద్దీన్, ధనుష్, గైడ్ కెప్టెన్లు సులోచన, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు


మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ

సత్యవేడు, జూన్ 27: గృహ నిర్మాణాలపై ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని, అలసత్వాన్ని సహించేదిలేదని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ శాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణాలపై వంద రోజులకార్యాచరణ ప్రణాళికను నిర్దేశించుకోవాలని సూచించారు. పెండింగ్ బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. హౌసింగ్ డీఈ సత్యనారాయణ, ఏఈ సుబ్రమణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమలేశుడి దర్శనానికి కుటుంబ సమేతంగా వచ్చిన మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావును తిరుపతి టీటీడీ నాయకుడు అజయ్ ప్రతాప్ గురువారం కలిశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి సేవలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల



శ్రీకాళహస్తి, జూన్ 27: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

దుల్హన్-చంద్రన్న పెళ్లికానుకపై హర్షం

శ్రీకాళహస్తి, జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వం దుల్హన్-చంద్రన్న పెళ్లికానుక పథకాన్ని అమలు చేయనుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ముస్లిం యువతుల పెళ్లిళ్ల కోసం 2014లో చంద్రబాబు దుల్హన్ పేరిట రూ.50వేల వంతున అందజేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి పేరు మార్చి ఆంక్షలు పెట్టి ఏ ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. తాజాగా టీడీపీ ప్రభుత్వం రూ.లక్ష వంతున ఆర్థిక సాయం అందించాలని ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో పురోగతి

శ్రీకాళహస్తి, జూన్ 27: దేశం బలమైన ఆర్థికశక్తిగా పురోగతి సాధించాలంటే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అవలంబించాల్సిన అవసరముందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో గురువారం జరిగిన సీపీఎం శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చర్యలు తీసుకోండి



సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు,తదితరులు

సత్యవేడు, జూన్ 27: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన వైద్య, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కాట్రపల్లె ఘటన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలన్నారు. హోటళ్ళు, చికెన్ దుకాణాలను తనిఖీ చేసి శుభ్రత పాటించేలాచర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో 2 ఉష, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని గోవర్ధనగిరిలో అధికారులు పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశారు. తాగు నీటి కుళాయిల వద్ద గేట్‌వాల్, గుంతల్లో నీటి నిల్వలను తొలగించారు. పట్టణంలోని చికెన్ దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించేలా సంబంధిత యజమానులకు నోటీసులు అందించారు.

ఇద్దరు మైనర్ బాలికల అదృశ్యం

శ్రీకాళహస్తి, జూన్ 27: పాఠశాలలకు వెళ్లిన ఇద్దరు మైనర్ బాలికలు ఇంటికి చేరుకోకపోవడంతో కలకలం రేగింది. మిట్ట కండ్రికకు చెందిన ఓ బాలిక రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన మరో మైనర్ బాలిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వీరిద్దరూ స్నేహితులు. వేర్వేరు పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇద్దరూ పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. బాలికల కుటుంబ సభ్యులు వెతికారు. రాత్రి అయినా జాడ తెలియలేదు. ఇరు కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి ఒకటో పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు.

అతిసార బాధిత గ్రామాల్లో అప్రమత్తం

- కాట్రపల్లిని సందర్శించిన అధికారులు


వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో, ఆర్డీవో, డీపీవో, డీఎల్‌పీవో

కేవీబీపురం, జూన్ 27: అతిసార వ్యాధి ప్రభావం చూపిన కాట్రపల్లిలో గురువారం డీఎంహెచ్‌వో శ్రీహరి, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎల్‌పీవో ప్రభురెడ్డి, డీపీవో రూపేష్, ఎంపీడీవో రెడ్డెయ్య పర్యటించారు. ఈ వ్యాధి లక్షణాలతో దర్శిని అనే చిన్నారి బుధవారం మరణించిన విషయం తెలిసిందే. తొలుత అధికారులు పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. శానిటేషన్ చేయించారు. తాగునీటి పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి మినరల్ వాటర్‌ను అందజేస్తున్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పారిశుధ్యం సరిగా లేక, కలుషిత ఆహారం తీసుకోవడం వలన అతిసారం ప్రబలిందని వివరించారు. ఆర్డీవో మాట్లాడుతూ అతిసార రాకుండానే గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలను తీసుకోరాదని సూచించారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మఠం, భైరాజులకండ్రిగ, అంజూరుపాళెం, బంగారమ్మకండ్రిగ గ్రామాల్లో కూడా ఒకరిద్దరికి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. వైద్యసిబ్బంది ప్రత్యేకంగా ఆ గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేదార్, డీటీ వెంకటసుబ్బయ్య, వైద్యాధికారి కుమార్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి గోవిందస్వామి, ఎంఈవో అంకయ్య, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రాణాలతో చెలగాటం ఆడతారా..

- ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణపై డీసీహెచ్‌ఎస్ ఆగ్రహం


ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, జూన్ 27: పీజీ డాక్టర్లతో వైద్యం చేయిస్తూ పేదల ప్రాణాలతో చెలగాటం ఆడతారా అని డీసీహెచ్‌ఎస్ మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో డయేరియా బాధితులకు అందిస్తున్న వైద్యసేవలను గురువారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో అధ్వాన పరిస్థితులను గుర్తించారు. చికిత్స అందిస్తున్న వార్డులో మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, తాగునీటి వసతి కూడా సరిగా లేదని డయేరియా బాధితులు చెప్పారు. జనరేటర్ సౌకర్యం లేక రాత్రి వేళ దోమలతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ తూర్పు మండలాల్లో డయేరియాపై ఆస్పత్రి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రి నిర్వహణపై నిత్యం ఫిర్యాదులు రావడం బాధాకరమన్నారు. రికార్డుల పనులకు స్టాఫ్ నర్సులను ఎందుకు కేటాయించారంటూ అధికారులను ఆరా తీశారు. ఇటీవల ప్రభుత్వం పదిమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు(డీఈవో), మరో పదిమంది జనరల్ డ్యూటీ అసిస్టెంట్ల(జేడీఏ)ను నియమించిందన్నారు. వారంతా ఏ పనులు చేస్తున్నారని నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. అత్యవసర ఆపరేషన్ కాన్పులు నిర్వహించకుండా రెఫర్ చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ మధు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎంజీఎం విద్యార్థులతో అధ్యాపకులు

సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూన్ 27: 2024 ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ఎంజీఎం జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంపీసీ విభాగంలో బేబీశ్రీ 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిందన్నారు. వెంకటాద్రి 465, కుమార్‌రెడ్డి వాసవి, ఎస్.మానస, సాయి ప్రణవి, బి.సాయి ప్రణవి, బి.సౌమ్య చందన 464 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో బిందు మాధవి 433 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ విద్యార్థులను గురువారం సన్మానించారు. ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం, మహదేవన్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఏర్పేడు, జూన్ 27: ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు చరణ్‌దీశ్, హేమలను గురువారం ప్రధానోపాధ్యాయులు ఆనంద్ గురువారం అభినందించారు. విద్యార్థులకు రెండు నెలలు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను కొనియాడారు. ఈ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుందన్నారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, జూన్ 27: మేర్లపాక ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు నరసింహులునాయుడు, శంకరయ్యాయాదవ్, వెంకటరమణయ్య, బాలాజీ, కేకే రమణ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డుకట్ట వేయండి: టీడీపీ

శ్రీకాళహస్తి, జూన్ 27: పట్టణంలో ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కా ర్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు, సా ంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి కోరారు. గురువారం వారు మాట్లాడుతూ ఆకతాయిల వికృతచేష్టలు శ్రుతి మించడంతో కొందరు విద్యార్థినులు చదువు మానుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్‌నగర్, తెలుగుగంగ కాలనీ, పూసలవీధి కూడలి, రిజర్వాయర్ రోడ్డులోని పాలడిపో కూడలి, జయరామరావువీధిలో వైష్ణవకోనేరు, కొత్త కోనేరు ఎస్టీకాలనీ, కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల, ఆర్టీసీ బస్టాండు కూడలి తదితర ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాన్నారు. నాయకులు సయ్యద్ చాంద్‌బాషా, షేక్ జిలానీ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న చైన్‌స్నాచర్లు

సత్యవేడు, జూన్ 27: పట్టపగలే చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. వినోభా నగర్‌కు చెందిన మునెమ్మ(55) గురువారం ఊత్తుకోట వెళ్ళి బస్సుదిగి ఒంటరిగా నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి బెదిరించాడు. ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పెయింటర్ల మృతి

- న్యాయం చేయాలంటూ మృతదేహాలతో రోడ్డుపై ధర్నా

సత్యవేడు, జూన్ 27: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు న్యాయం అందించాలని మృతుల బంధువులు గురువారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సత్యవేడులోని బీసీ కాలనీకి చెందిన ఎస్.అన్వర్ (37), నీలయ్య (25) తమిళనాడు రాష్ట్రం పూలంబేడుకు పెయింటింగ్ పనులకు వెళ్లారు. ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా వీరిని బుధవారం రాత్రి పట్టణ సమీప సరిహద్దు వద్ద కంటైనర్ లారీ ఢీకొంది. ఇద్దరూ మృతి చెందారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ గురువారం సాయంత్రం మృతదేహాలతో వారి బంధువులు, కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. ఎస్ఐ వీరాంజనేయులు వెళ్లి మాట్లాడారు. కేసు నమోదు చేశామని, కంటైనర్ యాజమాన్యంతో మాట్లాడి తప్పకుండా న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు శాంతించి ధర్నా విరమించారు.


ధర్నా చేస్తున్న మృతుల బంధువులు

పుత్తూరు వార్తలు

ప్రభుత్వం మారింది ..పద్ధతులు మార్చుకోండి

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించను
- గంజాయి, సారా, ఇసుక, భూకబ్జాలపై విచారణ
- మున్సిపల్ మీట్‌లో ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆగ్రహం


మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్


ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, ఆర్పీలు

పుత్తూరు అర్బన్, జూన్ 26: ప్రభుత్వం మారింది.... అందరూ పద్ధతులు మార్చుకోవాలి. ఇక్కడ ఉండేది రోజా కాదు భాను అనేది గుర్తుపెట్టుకోండి. పుత్తూరు ప్రశాంతతకు మారుపేరు.. అలాంటి పట్టణాన్ని ఈ ఐదేళ్లల్లో భ్రష్టుపట్టించారు. గంజాయి, సారా, ఇసుక, మట్టి స్మగ్లింగ్, భూ కబ్జాలతో అరాచకం సృష్టించారు. ఎన్నికలప్పుడు 13 వేల మద్యం బాటిళ్లు దొరికాయంటే పరిస్థితి తెలుస్తోంది. ఇకపై ఇలాంటి వాటిని ఉపేక్షించను. రౌడీయిజం చేసినా, శాంతిభద్రతల సమస్యను సృష్టించాలని చూసినా కఠినంగా అణచివేస్తాను. వీటన్నింటిపైనా విచారణకు ఆదేశించాను. ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెడతానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ హరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భానుప్రకాష్ మాట్లాడుతూ పుత్తూరు అభివృద్ధికి కలిసి రావాలని కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. అధికార యంత్రాంగం పద్ధతులు మార్చుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. నందిమంగళంలో అధికారులు ముందస్తుగానే తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఉంటే ప్రాణ నష్టం జరిగేది కాదన్నారు. ఇకపై ప్రజల ప్రాణాలకు పొరబాటు జరిగితే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సస్పెన్షన్ల కన్నా ముందు క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామన్నారు.

భాను హయాంలో పుత్తూరు అభివృద్ధి

తొలుత మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు డి.జయప్రకాష్, శంకర్ మాట్లాడుతూ భానుప్రకాష్ హయాంలో పుత్తూరు అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలన్నారు. కౌన్సిలర్లు, బసంతి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడంతో సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. భానుప్రకాష్‌ను టీడీపీ కౌన్సిలర్లతో పాటు వైసీపీ కౌన్సిలర్లు, చైర్మన్, వైస్ చైర్మన్లు, అధికారులు సన్మానించారు. మెప్మా విభాగ ఆర్పీలు, మున్సిపల్ ఉద్యోగులు సత్కరించారు. మాజీ ఎంపీపీలు డీఎన్ ఏలుమలై, గంజి మాధవయ్య, చినబాబు, ధనపాల్ పాల్గొన్నారు.

భూ వివాదంపై ఆర్డీవో హామీ

వడమాలపేట, జూన్ 27: ఎనమలపాలెం అరుంధతివాడలో భూవివాదంపై తహసీల్దార్ తప్పును సరిదిద్దుతామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ చెప్పారు. తిరుమణ్యం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 195-3లో 5.12 ఎకరాల్లో అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ రాజసింహ నరేంద్ర చర్యలు తీసుకోవాలని బాధితులు, సీపీఎం నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. దీంతో ఎస్ఐ ధర్మారెడ్డి ఆర్డీవోతో ఫోన్‌లో సంప్రదించారు. బాధితులతో పాటు సీపీఎం నాయకులు గురువారం ఆర్డీవోను కలిశారు. తహసీల్దార్‌పై విచారణ కొనసాగుతోందని, జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపుతున్నామని ఆర్డీవో నిషాంత్ రెడ్డి చెప్పారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆర్డీవోను కలిసిన వారిలో దళిత, గిరిజన, సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య, బాధితులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు విన్నవిస్తున్న బాధితులు, సీపీఎం నాయకులు

గంగమ్మకు సారె సమర్పణ

వడమాలపేట, జూన్ 27: కాయంపేటలో పిడతల గంగమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ గురువారం సారె సమర్పించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున గంగమ్మ తల్లిని ఊరేగించి, నడివీధిలో నెలకొల్పారు. పొంగళ్లు సమర్పించారు.